క్లుప్తంగా

వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ


ఎన్నుకున్న పరిరక్షణ కమిటీ

మంచిర్యాలటౌన్: వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.శివకుమార్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా దొమ్మటి కిరణ్‌కుమార్, కార్యదర్శులుగా ఆర్.రాజేశ్, జాయింట్ సెక్రటరీగా యు.ప్రభాకర్, ఇ.వినోద్‌కుమార్, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా తన్నీరు హేమవతి, ఉపాధ్యక్షుడిగా పొనగంటి శివలను ఎన్నుకున్నారు. వారికి నియామక పత్రాలను అందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

మంచిర్యాలఅర్బన్: పాల్గుణమాసం ప్రారంభ సందర్భంగా స్థానిక బైపాస్‌రోడ్‌లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరస్వామి రచించిన 100 అధ్యాత్మిక రచనలను ఇంటింటా పరిచయ కార్యక్రమం చేశారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక లక్సెట్టిపేట్ కమిటీ అధ్యక్షుడు రాజు, సభ్యులు రాకేశ్, లావణ్య అనుతేజ్, నాగిరెడ్డి, మధు, రవళి, సామిలత్ రష్మిత, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌రాజయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: బీఎస్‌ఆర్‌కెఎస్ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు రామ్‌రాజయ్య సంతాప సభను జిల్లా కేంద్రంలో నిర్వహించి, సభ్యులు నివాళులర్పించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన ఘనత రాజయ్యదని కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దపల్లి సూరన్న, జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న, ప్రధాన కార్యదర్శి మంచెర్ల సదానందం, మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, తుల మధుసూదన్, బెల్లంకొండ మురళి, నరేడ్ల శ్రీనివాస్, ఏదునూరు రమేశ్, మక్కా మురళి, బింగి టీకయ్య, పెంచాల శ్రీనివాస్, పొట్టాల మల్లేశ్, మెరుగు శ్రీనివాస్, జాడి దేవరాజ్, సదానందం పాల్గొన్నారు.

పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక వాగులోని గండాలలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం నైవేధ్యం వండి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో చెట్లకింద వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేసి తిరుగుపయనయ్యారు.

పోస్టర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో ఈనెల 4న క్రేజీ డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఎస్సై రాజశేఖర్‌తో కలిసి సభ్యులు ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ప్రజాకవులు, కళాకారులు హాజరవుతారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేశ్, డ్యాన్స్ మాస్టర్ రాకం సంతోష్, రాజమౌళి, సకినాల శంకర్, తదితరులు ఉన్నారు.

నేడు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర సీసీఐ జిన్నింగ్ మిల్లులో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మిల్లులో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరం

- పర్యావరణానికి హానికరం
- క్యాన్సర్ వ్యాధికి దారితీస్తున్న వైనం
- నిషేధిస్తేనే ప్రయోజనం


వారసంతలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులు

బెజ్జూర్: నిత్య జీవనంలో ప్లాస్టిక్ వాడకం అనర్థాలకు దారి తీస్తోంది. మార్కెట్‌లో సరుకులు, కూరగాయలు, బేకరీ వస్తువులు, ఇతరత్రా ఏది తెచ్చుకోవాలన్నా గన్నీ సంచి లేదా వైరుబుట్ట తీసుకెళ్లడం పాత అలవాటు. మారిన పరిస్థితులతో కూరగాయలు, పూలు, పళ్లు, మాంసం, పచారీ సరుకులు ఏది కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులలో తెచ్చుకోవడం పరిపాటైంది. బడ్డీ కొట్లు, ఫ్యాన్సీ షాపులలో అర్ధ రూపాయి నుంచి ఐదు రూపాయల విలువైన క్యారీబ్యాగులను విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ విచ్చలవిడిగా వాడడం వల్ల మానవ మనుగడ ప్రశ్నార్థంగా మారుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు.

పర్యావరణానికి హానికరం..

ప్లాస్టిక్ కవర్లను పాలిథిన్‌తో తయారు చేస్తారు. పాలిథిన్ శాతాన్ని బట్టి వాటి రంగు ఉంటుంది. తక్కువ పాలిథిన్ ఉన్న కవర్లు తెలుపు రంగులో, ఎక్కువ శాతం పాలిథిన్ ఉన్న కవర్లు నలుపు, నీలం రంగుల్లో ఉంటాయి. పాలిథిన్ శాతం ఎక్కువ ఉన్న కవర్లు తక్కువ ధరకు లభిస్తాయి. వీటిలో తినుబండారాలు, నిత్యావసర సరుకులు తీసుకెళ్తే క్యాన్సర్ కొనితెచ్చుకున్నట్లేనని వైద్య నిపుణుల అభిప్రాయం. పళ్లు, కూరగాయలు, సరుకులు రోజుల తరబడి ప్లాస్టిక్ క్యారీబ్యాగులలో ఉంచితే అవి విషపదార్థాలతో సమానమైన ఫలితాలు ఇస్తాయి. వినియోగించిన తర్వాత బయటకు విసిరేసిన ఖాళీ కవర్లు భూమిలో కలవడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు ఇవి విషవాయువులను వెదజల్లి ఓజోన్ పొరకు హాని కలిగిస్తాయంటున్నారు. దీంతో సూర్య కిరణాలు నేరుగా నేలపై పడి ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రమాదం కూడా ఉంది.

జీవులకు ప్రాణహాని..

మానవాళితో పాటు పశువులు, పందులు, కుక్కలు, ఇతర జంతువులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులలో పడేసిన వ్యర్థాలను తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. ఆహార పదార్థాలతో పాటు క్యారీ బ్యాగులను కూడా తింటున్న పశువుల జీర్ణకోశం ఛిద్రమై, జీర్ణశక్తి తగ్గిపోతుంది. తర్వాత అవి ఏమీ తినలేక, తాగలేక నీరసించి చనిపోతున్నాయి. ఫలితంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడే పలు రకాల జంతువులను ఈ ప్లాస్టిక్ కబళిస్తోంది.

ముప్పు కలిగించే వస్తువులు..

మనం విందులకు వినియోగించే ప్లాస్టిక్ రోల్స్, ప్లాస్టిక్ డిస్పోజబుల్ ఆకులు, గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు తదితర వస్తువులన్ని ప్రాణాంతకమైనవేనని నిపుణులు చెబుతున్నారు. వీటి ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు అత్యంత ప్రమాదకరమైనవని నిపుణులు చెబుతున్నారు. పలుచగా ఉన్న ఈ కవర్ల దృఢత్వం కోసం అధిక మోతాదులో రసాయనాలు కలుపుతారని, ఇవి హాని కలిగిస్తాయని పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

"ప్లాస్టిక్ నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నాం. గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వాడే వారికి జరిమానా విధిస్తున్నాం. ప్లాస్టిక్ వాడటం వల్ల మానవాళికి ఇబ్బందులపై ప్రతీ గ్రామ పంచాయతీలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం."

– బండారి ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో

పచ్చదనం.. ఆహ్లాదం


కెరమెరి: రోడ్డుకు ఇరువైపులా వృక్షాలతో మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్న ఈ దృశ్యం మండలంలోని సావర్‌ఖెడా గ్రామంలోనిది. గ్రామానికి ప్రవేశ ద్వారమిది.. గ్రామం ఎంత శుభ్రంగా ఉందో తెలియడానికి ఈ దృశ్యమే ప్రతి రూపం. కొన్నేళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు వృక్షాలై నీడను, ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి.

ఆత్మీయ భరోసా ఎప్పుడో..?

- నిరీక్షిస్తున్న భూమిలేని పేదలు
- నగదు కోసం ఎదురుచూపులు
- 31 గ్రామ పంచాయతీల్లో 2396 మంది గుర్తింపు



కెరమెరి: భూమిలేని నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అర్హులైన నిరు పేదలకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా గడుస్తున్నా ఇప్పటికీ పేదల ఖాతాల్లో నగదు చేరకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడెప్పుడు తమ ఖాతాల్లో డబ్బులు పడతాయా అని ఎదురు చూస్తున్నారు.

మండలంలో 2996 మంది అర్హులు..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 156 గ్రామాలు ఉండగా 33,287 మంది జనాభా ఉంది. కొద్ది రోజుల క్రితం సర్వేలో భాగంగా 2714 మంది పేదలు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోగా.. 2396 మందిని అర్హులుగా గుర్తించారు. వీరంతా ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కలిగి 20 రోజులకు పైగా పని చేసిన నిరుపేదలు. వీరికి ఒక్కొక్కరికి రూ.12 వేలు చొప్పున ప్రభుత్వం ఆత్మీయ భరోసా కింద వారి ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంది. కాని సర్వే చేసి నెల రోజులకు పైగా గడుస్తున్నా, ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతో అసలు ఈ పథకంలో అర్హులకు నగదు అందుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయం వద్ద పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న కమిటీ సభ్యులు

కౌటాల: మండలంలోని తాటిపల్లిలోని శ్రీ శివ సిద్ధి హనుమాన్ మందిర్‌లో ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మహాశివ రాత్రి సందర్భంగా ఆలయంలో ఐదు రోజుల పాటు జాతర ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పలు దుకాణాలు ఏర్పాటు చేయడంతో భక్తుల రద్దీ కారణంగా ఆలయ సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తాచెదారం తొలగించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులు, పోలీసులు సహకరించారని ఆలయ కమిటీ అధ్యక్షులు ఎల్ములే దత్తు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణ్ పటేల్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎల్ములే దత్తు, సభ్యులు దివాకర్, సంతోష్, మారుతి, రాజేందర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణబాబా బోధనలు ఆచరణీయం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న యోగానంద సరస్వతి

తాంసి: గ్రామాల్లో ప్రజలను చైతన్య చేస్తూ.. ప్రజలను ఆధ్యాత్మికతను అలవర్చిన మహనీయుడు నారాయణబాబా బోధనలు ఆచరణీయమని గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. ఆదివారం మండలంలోని వామన్‌నగర్ గ్రామంలో సంత్‌శ్రీ సద్గురు నారాయణబాబా సంస్థాన్‌లో 22వ అఖండ హరినామా యజ్ఞం నిర్వహించారు. మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు భక్తిభావం, సేవాగుణం అలవర్చేందుకు తనవంతుగా కృషి చేశారన్నారు. బాబా శిష్యులు ఆయన సేవలను నేటికి కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు పోచ్చన్న, మారుతిపటేల్, భూమారెడ్డి, గడ్డం గంగారెడ్డి, అశోక్, రజనీకాంత్ రెడ్డి, నాగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపాదరావు జయంతి


జైపూర్: నివాళులర్పిస్తున్న అధికారులు


శ్రీరాంపూర్: పూలమాల వేస్తున్న జీఎం


మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో

శ్రీరాంపూర్: మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద సింగరేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీపాదరావు రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా మంత్రిగా అనేకసార్లు సేవలు అందించారని గుర్తుచేశారు,. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీనివాస్, ఏజెంట్ శ్రీధర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, డిప్యూటీ పీఎం రాజేశ్వరరావు, ఇంజినీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైపూర్: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు తిరుపతి, మల్లేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. కమిషనర్ తౌటం శివాజీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఏరియాలోని కేకే ఓసీ ఆవరణలో మేనేజర్ రామరాజు ఆధ్వర్యంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎస్‌ఎస్‌వో రవీందర్, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జైనూర్: ఆసిఫాబాద్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆత్రం సక్కు యూ త్ ఫోర్స్ నాయకులు వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ ఇ న్‌చార్జి ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పోచంలొద్ది కస్తూర్బా పాఠశాలలోని 150 మంది ఇంటర్మీడియెట్, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్: మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మసాదే చరణ్, నాయకులు తదితరులు ఉన్నారు.

బర్డ్ ఫెస్టివల్‌లో జన్నారం విద్యార్థులు

జన్నారం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కవ్వాల్ బర్డ్‌ఫెస్టివల్ కార్యక్రమానికి జన్నారంలోని పలు పాఠశాలల విద్యార్థులు వెళ్లారు. అటవీశాఖ అధికారులు నిర్వహించిన అవగాహ న కార్యక్రమానికి వెళ్లి పక్షులు, వాటి ఉపయోగాలు, జీవ వైవిధ్యంలో పక్షులపాత్ర తదితర అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారని ఉపాధ్యాయులు తిరుపతి, మహేశ్ తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ పథకంలో రూ. 10 లక్షల నిధులతో మంజూరైన సీసీరోడ్డు పనులను ఆదివారం గ్రామస్తులు ప్రారంభించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గ్రామస్తుల ఆధ్వర్యంలో సీసీరోడ్డు పనులు చేపట్టనున్నట్లు గ్రామపటేల్ కినక లచ్చు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆత్రం శేకు, మెస్రం సోమేశ్వర్, పెందోర్ దేవ్‌రావ్, కినక జుగాదిరావ్, కొట్నాక్ సంతోష్, మెస్రం జల్పత్‌రావ్ పాల్గొన్నారు.

గుడిరేవులో ఇసుక నిల్వలు


నిల్వచేసిన ఇసుక

దండేపల్లి: మండలంలోని గుడిరేవులో భారీగా ఇసుక నిల్వ లు చేశారు. సమీప గోదావరి నది లో ఇసుకను తీసి, రహస్య ప్రదేశాల్లో డంప్‌చేసి ఉంచారు. ఇక్కడ నుంచి తరలించాల్సిన చోటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు దృష్టిసారించి, గుడిరేవు గోదావరి నదిలో ఇసుక అక్రమ రవాణా ను అరికట్టాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న సాగుకే మొగ్గు


పెంచికల్‌పేట్‌లో సాగు చేస్తున్న మొక్కజొన్న

- యాసంగిలో పెరిగిన సాగు విస్తీర్ణం

పెంచికల్‌పేట్: యాసంగి సీజన్‌లో రైతులు మొక్కజొన్న పంట సాగుపై మొగ్గు చూపడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం పెరిగింది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి పంటలను సాగు చేసిన రైతులు వర్షాలు లేక సాగు చేసిన పంటలకు ఆశించిన దిగుబడి రాలేదు. దీంతో రైతులు పత్తి పంటను తొలగించి మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పంట సాగుకు నీరు తక్కువ మోతాదులో అవసరం ఉండటంతో రైతులు మొక్కజొన్న సాగుకు ముందుకొచ్చారు.

మండలంలో..

పెంచికల్‌పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి, లోడుపల్లి, అగర్‌గూడ, లోడుపల్లి, కొండపల్లి, గొంట్లపేట్, బొంబాయిగూడ, చేడ్వాయి గ్రామాల్లో రైతులు పెద్ద మొత్తంలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. యాసంగిలో వరి పంట సాగుకు పెట్టుబడులు, కూలీల కొరత తీవ్రంగా ఉండటంతో ఆరుతడి పంటను సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ కాలం, తక్కువ పెట్టుబడితో ఎకరానికి సుమారు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు మద్దతు ధర రూ.2225 ప్రకటించడంతో మంచి లాభాలు వస్తాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో..



"వరి పంటలో ఆశించిన దిగుబడులు రాలేదు. దీంతో యాసంగిలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. ఇతర పంటల సాగుకు పెట్టుబడులు ఎక్కువ అవుతున్నాయి. తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న సాగుతో మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం. అధికారులు ప్రత్యామ్నాయ పంటల సాగుపైన రైతులకు అవగాహన కల్పించాలి."

– కొండయ్య, రైతు, ఎల్లూర్

దాడికి యత్నించినవారిని శిక్షించాలి

చెన్నూర్: పట్టణానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ నాయకుడు శివకృష్ణ ఇంటిపై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కత్తెరశాల మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో కొందరు పేకాట ఆడారని తెలిపారు. పవిత్ర జాతర నిర్వహించే గ్రామంలో పేకాట ఆడడాన్ని గమనించిన శివకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారు శివకృష్ణపై కక్ష పెట్టుకొని ఆదివారం ఆయన ఇంటిపై దాడికి యత్నించారని తెలిపారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు దుర్గం అశోక్, నర్సయ్య, సమ్మయ్య, కమ్మల శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.